7

# ఉపాయశాలి

ఒక ఊళ్ళో మాధవుడనే రైతు ఉండేవాడు.

అతనికి చిన్నతనంలోనే అమ్మ, నాన్న చనిపోయారు. అప్పటినుంచీ అతను పెద్ద రైతుల దగ్గర పనిచేస్తూ పొట్ట పోషించుకోసాగాడు. వయసొచ్చాక పెళ్ళి చేసుకున్నాడు. పిల్లాజెల్లా కలిగి సంసారం పెద్ద దవసాగింది. సంపాదన బొత్తిగా కుటుంబం జరగడానికే సరిపోయేది కాదు.

'ఇలాకాదు...సొంతంగా పొలం సంపాదించాలి!' అని నిర్ణయించుకున్నాడు. అయితే, చేతిలో పైసాలేని అతనికి పొలం ఎక్కడనుంచి వస్తుంది? అందుకే ఆ వూరి జమీందారు వీరేంద్రుని కలుసుకున్నాడు.

మాధవుడి తండ్రి ఆ జమీందారు దగ్గర కొంతకాలం నమ్మకంగా పని చేశాడు. అందుకే అతను వెళ్లగానే అభిమానంగా పలుకరించాడు. మాధవుడు తన మనసులోని మాట చెప్పాడు.

"చూడు మాధవా..! కష్టపడే వాడికెప్పుడూ లోటుండదు. దానికి తోడు - బుద్ధిబలంకూడా వుంటే ఆ వ్యక్తి సాధించలేనిదేమీ ఉండదు. నాకున్న బంజరుభూమిలో ఐదు ఎకరాలు నీకిస్తున్నాను. దానినుంచి ఎటువంటి ఫలితం పొందేదీ నీ చేతిలో ఉంది" అన్నాడు వీరేంద్ర.

సంతోషంతో ఆ పొలాన్ని స్వీకరించాడు మాధవుడు.

ఐదెకరాల పొలాన్ని బొత్తిగా డబ్బులేనివాడు సాగు చేయడమంటే మాటలా? మంచి ఉపాయంతో దానిని సాధించాలని నిశ్చయించుకున్నాడు మాధవుడు.

ఆ ఊళ్ళో రాత్రుళ్ళు బందిపోటు దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. ఆ విషయం తెలిసిన మాధవుడు ఒక ఉపాయం ఆలోచించాడు.

ఆ రాత్రి పలుగూ, పారా, ఒక చిన్న దీపం పుచ్చుకొని పొలానికి వెళ్లాడు.



దీపం ప్రక్కన పెట్టుకుని నేలని త్రవ్వడం మొదలు పెట్టాడు. అర్ధరాత్రి అయ్యేసరికి.., దొంగతనానికి బయలుదేరిన బందిపోట్లు అటు వెళ్తూ మాధవుడిని చూశారు. అర్ధరాత్రి నేల త్రవ్వుతుంటే వారికి ఆశ్చర్యమూ, అనుమానమూ వేశాయి.

దగ్గరకి వచ్చి అతనేం చేస్తున్నదీ అడిగారు.

వాళ్ళకి సమాధానం చెప్పడం ఇష్టం లేనట్లుగా ముఖం పెట్టి , నేలను మరింత బలంగా త్రవ్వడం మొదలు పెట్టాడు. అది చూసే సరికి దొంగలకి ఉత్కంఠ మరింత పెరిగింది.

'సమాధానం చెప్పమనీ.., లేకుంటే ప్రాణం తీస్తా..' మనీ బెదిరించారు.

ఇష్టం లేనట్లుగా చెప్తున్నట్లు నటిస్తూ - "ఈ ఊరి అమ్మవారు రోజూ నా కలలో కనిపిస్తూ ఈ పొలంలో బంగారు నిధి ఉందని చెప్పింది. అందువల్ల ఎవరూ చూడకుండా త్రవ్వాలని అనుకుంటే.., మీకంట పడ్డాను!" అన్నాడు మాధవుడు.

మాధవుడిని చంపి ఆ నిధిని తామే తీసుకుందామని ముందు అనుకున్నారు ఆ దొంగలు. కాని, అలా చేస్తే అమ్మవారు కోపిస్తుందేమోనని భయపడ్డారు. అందువల్ల "చూడూ..,

మేము కూడా ఈ పొలమంతా త్రవ్వుతాం. నువ్వొక్కడివే అయితే ఎప్పటికి అవుతుంది? దొరికిన నిధిలో సగం మాది. సరేనా?" అన్నారు దొంగలు.

'సరే' నని సంతోషంగా ఒప్పుకున్నాడు మాధవుడు.

దొంగలంతా కలబడి పొలం అంతా లోతుగా దున్నేశారు.

అయినా నిధేమీ కన్పించలేదు.

మాధవుడు తమని మోసం చేశాడని గ్రహించారు వాళ్ళు. అయినా... ఏమీ చేయలేక అదను చూసుకొని పగ తీర్చుకోవాలనుకున్నారు.

దొంగలు దున్నినపొలంలో విత్తనాలువేసి పంట పండించాడు మాధవుడు. మొక్కలు బాగా ఎదిగి పంట కోతకి వచ్చింది.

ఆ పంటను కోసుకు పోవాలనుకున్నారు దొంగలు. అది ముందే ఊహించిన మాధవుడు రోజూ రాత్రుళ్ళు పొలంలోనే కాపలా ఉంటుండసాగాడు.

అనుకున్నట్లుగానే... ఆ రోజు రాత్రి దొంగలు పంట కోసుకోవడానికి వచ్చారు.

వారి రాకని గమనించి మాధవుడు ఒక పెద్ద చెట్టు ఎక్కి, నక్కి కూర్చున్నాడు. దొంగలు వచ్చి పంటనంతా కోసి, కట్టలు కట్టుకొని తీసుకు వెళ్లబోతున్నారు.

వెంటనే మాధవుడు చెట్టు పైనుంచి "ఒరేయి రండి. దొంగల్ని పట్టుకోండి!" అని గట్టిగా అరిచాడు. అది వినగానే దొంగలు కంగారుపడి పారిపోయారు.

ఆ తర్వాత మాధవుడు చెట్టుదిగి వచ్చి దొంగలు కోసిన పంటనంతా హాయిగా ఇంటికి జేర్చి, గాదెల్లో భద్రపరిచాడు.

మాధవుడు మళ్ళీ తమని మోసం చేశాడని గ్రహించిన దొంగలు- ఎలాగైనా అతని పని పట్టాలని పట్టుబట్టారు. గాదెలలోని ధాన్యాన్ని ఆ రాత్రి దొంగిలించాలనుకున్నారు.

మాధవుడి పెరటి గోడకి కన్నంవేసి ఒక్కొక్కళ్ళూ లోపలకి రాసాగారు. అది తెలుసుకున్న మాధవుడు- దొంగ లోపలకి దూరగానే మొహాన గుడ్డేసి లాక్కునిపోయి నోరు కట్టేసి ముక్కు కోసేయసాగాడు. ఈవిధంగా అందరికీ చేసి, చివరకి వాళ్ళని ఒక్కొక్కరుగా వదిలేశాడు. ముక్కు పోయిందన్న అవమానంతో వారు వెనక్కి చూడకుండా పరుగెత్తారు.

తర్వాత మాధవుడు - దొంగల గురించి న్యాయాధికారులకు ఫిర్యాదు చేశాడు. దొంగల ముక్కులు తెగివుండడంతో వారిని సులువుగానే పట్టుకున్నారు రక్షక భటులు.

జనానికి ఎంతో ఇబ్బందిని కలిగిస్తున్న బందిపోట్లని చాకచక్యంగా పట్టుకున్నందుకు మెచ్చుకొని అధికారులు మాధవుడికి మంచి బహుమతి ఇచ్చారు. వీరేంద్రకూడా అతని ఉపాయానికి ఆనందించి, అతని తెలివి తేటలకు మెచ్చుకొని మరింత పొలం, ధనం ఇచ్చి సన్మానించారు.

★★★